మూకశంకరులు -మూకపంచశతి

****

శ్లోకము -1

కారణపరచిద్రూపా కాఞ్చీపురసీమ్ని కామపీఠగతా।
కాచన విహరతి కరుణా కాశ్మీరస్తబకకోమలాఙ్గలతా॥

<u>తాత్పర్యము</u> :- కారణపర చైతన్య రూపిణి కామపీఠము నాశ్రయించినది, కుంకుమ పూగుత్తి వలె మృదువైన తీగ వంటి దేహము గల యొకానొక దయ కాంచీపుర ప్రదేశమున విహరించుచున్నది.

శ్లోకము – 2

కఞ్చన కాఞ్చీ నిలయం కరధృతకోదణ్డబాణసృణిపాశమ్।
కఠినస్తనభరనమ్రం కైవల్యానన్దకన్దమవలమ్బే॥

<u>తాత్పర్యము</u> :- లోకరక్షణకై ధనువు, బాణము, పాశము, అంకుశము ధరించి వెలుగుచు, మోక్షానందమునకు కారణమైన ఆ శ్రీమాత కాంచీపురమున కొలువై యొప్పుచున్నది. అట్టి జగన్మాతను ఆశ్రయింతును.

శ్లోకము -3

చిన్తితఫలపరిపోషణ చిన్తామణిరేవ కాఞ్చినిలయా మే।
చిరతరసుచరితసులభా చిత్తం శిశిరయత చిత్సుధాధారా॥

<u>తాత్పర్యము</u> :- భక్తుల కోర్కెలను తీర్చుచింతామణిగా ప్రసిద్ధమైన ఆజగజ్జనని కంచిలో, కామాక్షిగా ప్రకాశించుచున్నది. ఆ చైతన్య ప్రవాహరూపిణి, తపించు నా చిత్తమును చల్లబరచుగాక.

శ్లోకము-4

కుటిలకచం కఠిన కుచం కున్దస్మిత కాన్తి కుఙ్కుమచ్ఛాయమ్।
కురుతే విహృతిం కాఞ్చ్యాం కులపర్వత సార్వభౌమ సర్వస్వం॥

<u>తాత్పర్యము</u> :- హిమవంతుని ప్రియపుత్రిక పార్వతి, వంకులజుట్టు, మొల్లపూవు వంటి నవ్వు, కఠిన కుచములు, కుంకుమ రంగు గల శరీరము కలిగి, కంచిలో కామాక్షి అను పేరుతో విహరించుచున్నది.

శ్లోకము-5

పఞ్చశర శాస్త్రబోధన - పరమాచార్యేణ దృష్టిపాతేన।
కాఞ్చీ సీమ్ని కుమారీ కాచన మోహయతి కామజేతారమ్॥

<u>తాత్పర్యము</u> :- విలాసమగుతన చూపులతో, కాముని జయించిన శివుని మోహింపజేయుచు, కంచిలో ఒక కుమారి తిరుగాడుచున్నది.

శ్లోకము-6

పరయా కాఞ్చీపురయా పర్వత పర్యాయపీన కుచభరయా।
పరతన్త్రా వయమనయా పఙ్కజస బ్రహ్మచారిలోచనయా॥

<u>తాత్పర్యము</u> :-
కాంచీపురమునే తన నివాసముగా చెసికొన్న పరమ శ్రేష్ఠురాలు, పర్వతములవంటి బరువైన కుచములు, పద్మదళముల వంటి నేత్రములు కలిగిన తల్లి, కామాక్షీ దేవికి మేము దాసులము.

శ్లోకము-7

ఐశ్వర్యమిన్దుమౌలే రైకాత్మ్యప్రకృతి కాఞ్చీమధ్యగతమ్।
ఐన్దవకిశోరశేకర మైదమ్పర్యం చకాస్తి నిగమానామ్॥

<u>తాత్పర్యము</u> :- చంద్రశేఖరుడైన శివుని అర్ధాంగియగు శ్రీమాత, వేదములసారము. ఆ జగజ్జనని, జీవులకు ఈశ్వర జ్ఞానమును కలిగించుచూ, కాంచీపురమున కామాక్షిగా ప్రకాశించుచున్నది.

శ్లోకము - 8

శ్రితకమ్పాసీమానం శిథిలితపరమశివధైర్యమహిమానమ్।
కలయే పాటలిమానం కఞ్చన కఞ్చకితభువనభూమానమ్॥

<u>తాత్పర్యము</u> :-   పంపానదీతీరమునగల కాంచీ నగరమున, తన సౌందర్యముచే పరమశివుని ధైర్యమును చలింపజేయు ఆ భువనమాతను, ఎఱ్ఱని కాంతి స్వరూపముగా ధ్యానించుచున్నాను.

శ్లోకము-9

ఆదృతకాఞ్చీనిలయా- మాద్యామారూఢయౌవనాటోపామ్।
ఆగమవతంసకలికా- మానన్దాద్వైతకన్దలీం వన్దే॥

తాత్పర్యము :- కాంచీపట్టణమున నివసించుటకు ఆదరముచూపునది, నిత్యయౌవనము గల వేదకాంతల శిరోరత్నమై విరాజిల్లునది, ఆనందాద్వైత మూలస్వరూపిణియైన ఆ ఆదిశక్తికి నమస్కరించుచున్నాను.

శ్లోకము-10

తుఙ్గాభిరామకుచభర - శృఙ్గారితమాశ్రయామి కాఞ్చీగతమ్।
గఙ్గాధరపరతన్త్రం శృఙ్గారాద్వైతతన్త్రసిద్ధాన్తమ్॥

తాత్పర్యము :- గంగాధరుడైన శివునికి విధేయురాలై, ఆ జగజ్జనని కంచిలో కామాక్షిగా కొలువై ఉన్నది. వారు అర్ధనారీశ్వరులై అద్వైత తత్త్వమును బోధించుచున్నారు. వారి పాద పద్మములకు భక్తితో ప్రణమిల్లుచున్నాను.

శ్లోకము -11

కాఞ్చీరత్నవిభూషాం కామపి కన్దర్పసూతికాపాఙ్గీమ్।
పరమాం కలాముపాసే పరశివవామాఙ్కపీఠికాసీనామ్॥

తాత్పర్యము :- కాంచీనగరమునకు రత్నాభరణమై, కాముని సృజించు కన్నులు కలదై పరమశివుని ఎడమ తొడపై కూర్చొండియుండు ఒకానొక పరమకళను (కామాక్షిని) ఉపాసించుచున్నాను.

శ్లోకము -12

కమ్పాతీరచరాణాం కరుణాకోరకితదృష్టిపాతానామ్।
కేలీవనం మనో మే కేషామ్ చిద్భవతు చిద్విలాసానామ్॥

తాత్పర్యము :- కంపానదీ తీరమున కరుణాంకురితమైన చూపులతో విహరించు ఆ దేవి అనిర్వచన చిద్విలాసములకు నా హృదయము కేళీ వనమగుగాక.

శ్లోకము 13

ఆమ్రతరుమూలవసతే- రాదిమపురుషస్య నయనపీయూషమ్।
ఆరబ్ధయౌవనోత్సవ మామ్నాయరహస్యమన్తరవలమ్బే॥

<u>తాత్పర్యము</u> :- మామిడిచెట్టు యొక్క మూలమును నివాసముగా చేసుకొన్నది, ఆది పురుషుడైన పరమేశ్వరుడి నేత్రాలకి అమృతములాంటిది, నిండు యవ్వనంతో ప్రకాశించేది అయిన వేద రహస్యాన్ని, ఆ కామాక్షీ దేవిని నా మనసులో స్థిరంగా పట్టి ఉంచెదను.

శ్లోకము 14

అధికాఞ్చి పరమయోగిభి రాదిమపరపీఠసీమ్ని దృశ్యేన।
అనుబద్ధం మమ మానస మరుణిమ సర్వస్వసమ్ప్రదాయేన॥

<u>తాత్పర్యము</u> :- మోక్షదాయకమైన కాంచీనగరమున గల పరమశివ పీఠము నందు, ధవుని అంకమున అధివసించి, యోగులచే ఉపాసింపబడుచు, మిక్కిలి ఎర్రని వర్ణముతో ప్రకాశించు తల్లిని, భక్తితో నా హృదయమున సంభావించుచున్నాను.

శ్లోకము 15

అంకిత శంకరదేహా మంకురితోరోజ కంకణాశ్లేషైః ।
అధికాంచి నిత్యతరుణీమద్రాక్షం కాంచిదద్భుతాం బాలాం ||

<u>తాత్పర్యము</u> :- అనురాగముతో నిత్యయౌవనియైన అమ్మవారిని ఆలింగనము చేసుకొన్న పరమశివుని శరీరమున చిహ్నములేర్పడినవి. కాంచీనగరమున నేను ఆ పరమాద్భుత రూపిణియగు బాలను దర్శించితిని.

శ్లోకము 16

మధురధనుషా మహీధర- జనుషా నన్దామి సురభిబాణజుషా।
చిద్వపుషా కాంచిపురే కేలిజుషా బన్ధుజీవకాన్తిముషా॥

<u>తాత్పర్యము</u> :- చెరుకు విల్లు, పూవులను బాణములుగా ధరించినది, బందూక పుష్పాల కాంతిని అపహరించే గొప్ప చైతన్య శరీరము కలిగినది, కాంచీపురములో ఆటలాడుకొనేది, పర్వతరాజు హిమవంతునికి కూతురుగా పుట్టినది అయిన కామాక్షీ దేవిని చూసి ఆనందిస్తున్నాను.

శ్లోకము 17

మధురస్మితేన రమతే మాంసలకుచభారమన్దగమనేన।
మధ్యేకాఞ్చి మనో మే మనసిజ సామ్రాజ్య గర్వబీజేన॥

<u>తాత్పర్యము</u> :- ఆ కాంచీనగరం మధ్యలో మధురమైన చిరునవ్వుతో ప్రకాశించేది, ఉన్నతమైన కుచాల బరువుతో నెమ్మదిగా నడుస్తున్నది, మన్మధుని సామ్రాజ్యానికి గర్వకారణమైన బీజాములా ఉన్నది అయిన కామాక్షీ దేవితో నా మనసు రమిస్తోంది (ఆనందిస్తోంది).

శ్లోకము 18

ధరణిమయీం తరణిమయీం పవనమయీం గగనదహనహోతృమయీం
।
అంబుమయీ మిందుమయీ మంబామనుకంపమాది మామీక్షే ॥

<u>తాత్పర్యము</u> :- భూమి, సూర్యుడు, వాయువు, ఆకాశము, అగ్ని, యజమాని, జలము, చంద్రుడు అనే అష్టమూర్తి రూపిణిగా వెలుగొందే ఆదిమాతని ఆ పవిత్ర కంపానదీ తీరంలో చూస్తున్నాను.

శ్లోకము 19

లీనస్థితి మునిహృదయే ధ్యానస్తిమితం తపస్యదుపకంపం ।
పీనస్తనభరమీడే మీనధ్వజతంత్ర పరమతాత్పర్యం ॥

<u>తాత్పర్యము</u> :- కంపానదీ తీరంలో తపస్సు చేస్తూ, మునుల హృదయాలలో లీనమైన స్థితి కలిగినది, నిశ్చలంగా ధ్యాన స్థితిలో ఉన్నది, ఉన్నతమైన బరువైన స్తనాలు కలిగినది, మన్మధ తంత్రానికి (ఆది విద్యకి) పరమతాత్పర్యరూపంగా కనిపించేది అయిన కామాక్షీదేవిని స్తుతిస్తాను.

శ్లోకము 20

శ్వేతామంథరహసితే శాతా మధ్యే చ వాఙ్మనోఽతీతా ।
శీతా లోచనపాతే స్ఫీతా కుచసీమ్ని శాశ్వతీ మాతా ॥

<u>తాత్పర్యము</u> :- నిత్య స్వరూపిణి అయిన ఆ కామాక్షీ మాత చిరునవ్వు తెల్లగా ప్రకాశిస్తుంది. నడుము సన్నగా ఉంటుంది. ఆమె చూపులు చల్లగా ఉంటాయి. ఆమె కుచసీమ ఉన్నతంగా కనిపిస్తుంది. అలాంటి దేవి స్వరూపం మాటకి మనసుకి అందనిది.

శ్లోకము 21

పురతః కదా ను కరవై పురవైరివిమర్దపులకితాంగలతాం ।
పునతీం కాంచీదేశం పుష్పాయుధవీర్యసరసపరిపాటీం ||

<u>తాత్పర్యము</u> :- త్రిపురాసురసంహారమొనర్చినశివుని ఆలింగనమున పులకితమగు శరీరము కలది, కాంచీనగర ప్రాంతమును పవిత్రమొనరించునదియైన కామాక్షీదేవి ఆనంద స్వరూపమును ఎన్నడు సాక్షాత్కరించుకొనగలుగుదునో?

శ్లోకము 22

**పుణ్యా కాఽపి పురంధ్రీ పుంఖితకందర్పసంపదా వపుషా ।
పులినచరీ కంపాయాః పురమథనం పులకనిచులితం కురుతే ॥**

<u>తాత్పర్యము</u> :- కంపా నదీ తీరమున, ఇసుక తిన్నెలపై విహరించు నిత్యయౌవవన యగు ఒకానొక పతివ్రతాంగన (ఆ కామాక్షి మాత) మన్మథభావమును ఉద్దీపింపజేయు తన సౌందర్యముతో ప్రియుడగు శివుని పులకింపచేయుచున్నది.

శ్లోకము 23

తనిమాద్వైతవలగ్నం తరుణారుణసంప్రదాయతనులేఖం ।
తటసీమని కంపాయా స్తరుణిమ సర్వస్వమాద్యమద్రాక్షం ॥

<u>తాత్పర్యము</u> :- కంపానదీతీరమునగల కాంచీనగరమున, సన్నని నడుము, సంపూర్ణ యౌవనము కలగి బాలసూర్యప్రభలతో వెలుగొందు జగదంబ కామాక్షీదేవి, ఉపాసన విధులలో ఒకటైన తరుణారుణ సంప్రదాయ రక్షణ చేయుచున్నట్లు తోచుచున్నది.

శ్లోకము 24

పౌష్టికకర్మవిపాకం పౌష్పశరం సవిధసీమ్ని కంపాయాః ।
అద్రాక్షమాత్తయౌవన మభ్యుదయం కంచిదర్ధశశిమౌళేః ॥

<u>తాత్పర్యము</u> :- కంపానదీ సమీపమున, మన్మథుడుచేయు పౌష్టిక కర్మలచే సంప్రాప్త యౌవనయగు ఆ జగజ్జనని కామాక్షిని చంద్రశేఖరుడైన శివుని ఐహికాముష్మిక అభ్యుదయమునకు కారణమైనదానినిగా చూచితిని.

శ్లోకము 25

సంశ్రితకాంచీదేశే సరసిజదౌర్భాగ్యజాగ్రదుత్తంసే ।
సంవిన్మయే విలీయే సారస్వతపురుషకారసామ్రాజ్యే ॥

<u>తాత్పర్యము</u> :- కాంచీపురమున ఆశ్రయించి, చంద్రుని్ని శిరోభూషణముగా గల, జ్ఞానమయమైన, సారస్వత పరిపూర్ణతయైన అమ్మవారి యందు లీనమగుచున్నాను.

శ్లోకము 26

మోదితమధుకరవిశిఖం స్వాదిమసముదాయసారకోదండం ।
ఆదృతకాంచీఖేలన మాదిమమారుణ్యభేదమాకలయే ॥

<u>తాత్పర్యము</u> :- పూలబాణములు, చెరుకువిల్లు ధరించి, సృష్టి ఆదియందు గల అరుణవర్ణముతో, కాంచీనగర ప్రదేశమున క్రీడావిలాసముగా విహరించు కామాక్షీదేవిని నా హృదయమున ధ్యానించుచున్నాను.

శ్లోకము 27

ఉరరీకృతకాంచిపురీ ముపనిషదరవిందకుహరమధుధారాం ।
ఉన్నమ్రస్తనకలశీ ముత్సవలహరీముపాస్మహే శంభోః ॥

<u>తాత్పర్యము</u> :- వేదాంత కమలగర్భముల నుండి స్రవించు మధుధార యనదగినదియు, జీవలోకముల పోషింపజాలు ఉన్నత స్తనములు కలదియు, శివుని సంతోష ప్రవాహమైనది యైన, కాంచీనగర నివాసి శ్రీ కామాక్షీదేవిని మనమందరము ఉపాసించుదము.

శ్లోకము 28

ఏణశిశుదీర్ఘలోచన మేనఃపరిపంథి సంతతం భజతాం ।
ఏకామ్రనాథజీవిత మేవంపదదూరమేకమవలంబే ॥

<u>తాత్పర్యము</u> :- జింకపిల్ల కనులవలె పొడవైన కనులు కలిగి, భక్తితో తన్నెప్పుడు, ఆశ్రయించువారి పాపముల పారద్రోలుచు, ఇట్టిదని పోలిక చెప్పుటకు మాటలే చాలనిది, కంచిలో కొలువున్న ఏకామ్రనాథుని జీవితముగా ప్రసిద్ధిగన్న ఆ కామాక్షీదేవిని ఆశ్రయించుచున్నాను.

శ్లోకము 29

స్మయమానముఖం కాంచీ భయమానం కమపి దేవతాభేదం ।
దయమానం వీక్ష్య ముహు ర్వయమానందామృతాంబుధౌ మగ్నాః ॥

<u>తాత్పర్యము</u> :- చిరునవ్వులు చిందించుముఖముతో, కాంచీనగరము చేరుచు దయగలచూపులతో చూచుచున్న మహా మహిమాన్విత యగు దేవతామూర్తిని కామాక్షిని మాటిమాటికి చూచి మేము ఆనందామృత సముద్రమున మునిగితిమి.

శ్లోకము 30

కుతుకజుషి కాంచిదేశే కుముదతపోరాశిపాకశేఖరితే ।
కురుతే మనోవిహారం కులగిరిపరిబృఢకులైకమణిదీపే ॥

<u>తాత్పర్యము</u>:-కాంచీనగరమున నివాసముండుటకు ఉత్సాహము చూపునది, కలువల రాయడగు చంద్రుని శిరస్సున ధరించునది, హిమవంతుని కులమును ప్రకాశింపజేయు మణిదీపమై వెలుగొందు కామాక్షీదేవిని దర్శించి, సేవించుట యందు నా మనస్సు లగ్నమగు చున్నది.

శ్లోకము 31

వీక్షేమహి కాంచిపురే విపులస్తన కలశగరిమ పరవశితం ।
విద్రుమసహచరదేహం విభ్రమ సమవాయసారసన్నాహం॥

<u>తాత్పర్యము</u> :- విలాస విలసితమగు పగడపు రంగు శరీర వర్ణము కలిగి, విశ్వజననియైన కామాక్షీదేవిని కంచిలో దర్శించుదముగాక.

శ్లోకము 32

కురువిందగోత్రగాత్రం కూలచరం కమపి నౌమి కంపాయాః ।
కూలంకషకుచకుంభం కుసుమాయుధ వీర్యసారసంరంభం॥

<u>తాత్పర్యము</u> :- కురువిందమణులవంటి మేని ఛాయ కలిగి, ఉన్నత స్తనములతో, మన్మథుని విజృంభణమనదగిన యౌవన విలాసముతో కంపానదీ తీరమున సంచరించు జగజ్జనని శ్రీకామాక్షీ దేవికి నమస్కరించుచున్నాను.

శ్లోకము 33

కుట్మలితకుచకిశోరైః కుర్వాణైః కాంచిదేశసౌహార్దం ।
కుంకుమశోణైర్నిచితం కుశలపథం శంభుసుకృతసంభారైః॥

<u>తాత్పర్యము</u> :- కాంచీనగర నివాసమునందు ప్రీతికలిగి, కాశ్మీర కుంకుమ వర్ణముతో ప్రకాశించు కామాక్షీ అమ్మవారు, శివుని పుణ్యముల రాశిగా సంభావింపబడుచున్నది.

శ్లోకము 34

అంకితకచేన కేనచి దంధంకరణౌషధేన కమలానాం ।
అంతఃపురేణ శంభో రలంక్రియా కాఽపి కల్ప్యతే కాంచ్యాం॥

<u>తాత్పర్యము</u> :- శిరస్సు నందు చంద్రుని భూషణముగా ధరించిన పరమ శివుని అంతఃపురమైన కామాక్షీదేవి చేత కాంచీపురమునకు ఒక అలంకారము కల్పింపబడుచున్నది.

శ్లోకము 35

ఊరరీకరోమి సంతతమ్ ఊష్మలఫాలేన లాలితం పుంసా ।
ఉపకంపముచితఖేలన ముర్వీధరవంశసంపదున్మేషం॥

<u>తాత్పర్యము</u> :- హిమవంతుని ఇంట పుట్టి, ఆ వంశ సంపద అభివృద్ధి కి కారణమైనది, త్రినేత్రుడైన శివునిచే లాలింపబడు కామాక్షీదేవి, కంపానదీతీరమున విహరించుచు భక్తుల ననుగ్రహించుచున్నది.

శ్లోకము 36

అంకురితస్తనకోరక మంకాలంకారమేకచూతపతేః ।
ఆలోకేమహి కోమల మాగమసంలాపసారయాథార్థ్యం॥

<u>తాత్పర్యము</u> :- కాంచీనగరమున కొలువున్న, ఏకామ్రేశ్వరుని అంకమున అలంకారమై అలరారుచు సకలాగమ సారమై యొప్పు కామాక్షీ అమ్మవారిని బాలాస్వరూపముగా దర్శింప గలము.

శ్లోకము 37

పుంజితకరుణముదంచిత శింజితమణికాంచి కిమపి కాంచిపురే ।
మంజరితమృదులహాసం పింజరతనురుచి పినాకిమూలధనం॥

<u>తాత్పర్యము</u> :- మూర్తీభవించిన దయాస్వరూపమై, చిరు మువ్వల సవ్వడులతో కూడిన మణిమయమగు
వడ్డాణమును ధరించి, వికసించిన పూగుత్తివలెనున్న నవ్వుతో, పినాకపాణియైన శివుని మూలధనమనదగిన కామాక్షీదేవి, కాంచీపురమున దర్శనమిచ్చుచున్నది.

శ్లోకము 38

లోలహృదయోఽస్మి శంభోర్లోచనయుగళేన లేహ్యమానాయాం ।
లాలితపరమశివాయాం లావణ్యామృతతరంగమాలాయాం ॥

<u>తాత్పర్యము</u> :- లోకనాయకుడైన శివుని లాలించుచున్న అమ్మవారి లావణ్యామృత తరంగములను అతడు కన్నులతో ఆస్వాదించుచున్నాడు. ఆ జగన్మాతాపితరుల పదములందు నా హృదయము లగ్నమగుచున్నది.

శ్లోకము 39

మధుకరసహచరచికురై ర్మదనాగమసమయదీక్షిత కటాక్షైః ।
మండితకంపాతీరైర్మంగలకందైర్మమాస్తు సారూప్యం ॥

<u>తాత్పర్యము</u> :- తుమ్మెదలవలె నల్లని కురులు, దయాపూర్ణములగు కనులు కలిగి, శుభములకు ఆలవాల మగుచు కంపానదీ తీరమున అలంకరించు కామాక్షీదేవి యొక్క సారూప్యముక్తి నాకలవడుగాక.

శ్లోకము 40

వదనారవిందవక్షో వామాంకతటీవశం వదీభూతా ।
పురుషత్రితయే త్రేధా పురంధ్రిరూపా త్వమేవ కామాక్షి॥

<u>తాత్పర్యము</u> :- పరదేవతవగు ఓ కామాక్షీదేవీ.! నీవు, ముగురమ్మల మూలపుటమ్మవై యుండి, త్రిమూర్తులకు, త్రిశక్తులుగా విరాజిల్లుచున్నావు. అట్టి నీకు నా వందనములు.

శ్లోకము 41

బాధాకరీం భవాబ్ధే రాధారాద్యంబుజేషు విచరంతీం ।
ఆధారీకృతకాంచీమ్ బోధామృతవీచిమేవ విమృశామః॥

<u>తాత్పర్యము</u> :- చావు పుట్టుకలతో గూడిన సంసార సాగరమును దాటించునది, యోగవిద్యలో కుండలినీ శక్తియై, మూలాధారము నుండి ఆజ్ఞాచక్రము వరకు సంచరించుచు, సహస్రారమున శివునితో గూడి ఆనందించుచు, సాధకుల ననుగ్రహించు కంచి కామాక్షీదేవిని, నిరంతరము ధ్యానించెదను.

శ్లోకము 42

కలయామ్యంతశ్శశధర కలయాఽంకితమౌళిమమలచిద్వలయాం ।
అలయామాగమపీఠీం నిలయాం వలయాంకసుందరీమంబాం ॥

<u>తాత్పర్యము</u> :- శశిశేఖరుడైన శివుని ఆత్మశక్తియై, వేదపీఠికపై అలరారు నవావరణ సుందరియగు కామాక్షీ అమ్మవారిని నా హృదయమున ధ్యానించెదను.

శ్లోకము 43

శర్వాదిపరమసాధక గుర్వానీతాయ కామపీఠజుషే ।
సర్వాకృతయే శోణిమ గర్వాయాస్మై సమర్ప్యతే హృదయం ॥

<u>తాత్పర్యము</u> :- సర్వారుణస్వరూపమై శివయోగి మొదలగు పరమసాధకులచే కామపీఠమగు మూలాధారమున సంసేవ్యమగుచున్న, కామాక్షీ అమ్మవారికి భక్తి పూర్వకముగా నా హృదయము సమర్పింప బడుచున్నది.

శ్లోకము 44

సమయా సాంధ్యమయూఖైః సమయా బుద్ధ్యా సదైవ శీలితయా ।
ఉమయా కాంచీరతయా నమయా లభ్యతే కింను తాదాత్మ్యం ॥

<u>తాత్పర్యము</u> :- సంధ్యాసమయ కిరణకాంతితో, మూలాధారమున సమయాదేవిగా ఉపాసింపబడుచున్న ఉమ యగు కంచి కామాక్షీ అమ్మవారితో నాకు తాదాత్మ్యము కలుగకపోదు.

శ్లోకము 45

జంతోస్తవ పదపూజన సంతోషతరంగితస్య కామాక్షి ।
బంధో యది భవతి పునః సింధోరంభస్సు బంభ్రమీతి శిలా ॥

<u>తాత్పర్యము</u> :- అమ్మా! ఓ కామాక్షీ దేవీ! నీ పాదపూజ చేయువారి హృదయములు సంతోష తరంగితములగును. అట్టి భక్తులకు భవబంధములుండవు. సముద్ర జలములపై రాళ్ళు తేలుట సాధ్యము కాదుకదా?

శ్లోకము 46

కుండలి కుమారి కుటిలే చండి చరాచరసవిత్రి చాముండే ।
గుణిని గుహారిణి గుహ్యే గురుమూర్తే త్వాం నమామి కామాక్షి॥

<u>తాత్పర్యము</u> :- అమ్మవారు కుండలినీ రూపముతో సంచరించుచు పరమాత్మతో గూడి సహస్రార గుహలోనుండి గుహ్యాయై సాధకులచే ఆరాధింపబడుచున్నది. ఆమె కుటిలులు, కుత్సితులునగు చండముండాది రాక్షసులను సంహరించి చండికగా ప్రసిద్ధిగాంచినది. ఆ జగజ్జనని, సగుణరూపమున భక్తులను వాత్సల్యముతో అనుగ్రహించుచున్నది. అట్టి గురుమూర్తిని కామాక్షిని నమస్కరించుచున్నాను.

శ్లోకము 47

అభిదాకృతిర్భిదాకృతి రచిదాకృతిరపి చిదాకృతిర్మాతః ।
అనహంతా త్వమహంతా భ్రమయసి కామాక్షి శాశ్వతీ విశ్వం ॥

<u>తాత్పర్యము</u> :- ఓ తల్లీ! కామాక్షీ దేవి!నీవు భేదములేనిదానివయ్యూ, విశ్వమున గల వివిధాకృతులలో దర్శనమిచ్చుచున్నావు. లోకమున గల జడ, చైతన్య శక్తులు రెండునూ నీవే. అహంకారమే లేని నీవు జీవభావమున నేననెడి అహంభావమును ప్రకటించుచున్నావు. శాశ్వతమైన నీవు, మాయతో అశాశ్వతమైన విశ్వమును భ్రమింపజేయుచున్నావు. సర్వసమర్థురాలవైన నీకు నమస్కారము.

శ్లోకము 48

శివ శివ పశ్యంతి సమం శ్రీకామాక్షీకటాక్షితాః పురుషాః ।
విపినం భవనమమిత్రం మిత్రం లోష్టం చ యువతిబింబోష్ఠం॥

<u>తాత్పర్యము</u> :- జననీ! కామాక్షీ. జ్ఞానవైరాగ్యములు కల నీ భక్తులు జితేంద్రియులై అడవిని ఇల్లుగాను, శత్రువును మిత్రునిగాను, బంగారమును మట్టిముద్ద గాను భావించి సంసారమును తరించుచున్నారు. సుఖ దుఃఖాది భేదములను వారు గణింపరు. శివ శివా ! ఇది విచిత్రము కదా.

శ్లోకము 49

కామపరిపంథికామిని కామేశ్వరి కామపీఠమధ్యగతే ।
కామదుఘా భవ కమలే కామకలే కామకోటి కామాక్షి ॥

<u>తాత్పర్యము</u> :- కాముని జయించిన శివునిచే కోరబడినది కావున అమ్మవారు కామేశ్వరి. కాముని మించిన సౌందర్యము గల శివుడు కామేశ్వరుడు. భక్తుల కోరిక లన్నింటిని తీర్చగల జనని లక్ష్మీ స్వరూపిణి, కామకోటిగా కీర్తింపబడుచున్నది. నిరాకారయగు ఆ కామాక్షిని, తనకు మోక్షమిమ్మని కంచి కామకోటి పీఠాధిపతి మూకకవి ప్రార్థించుచున్నాడు.

శ్లోకము 50

మధ్యేహృదయం మధ్యే నిటిలం మధ్యేశిరోఽపి వాస్తవ్యాం ।
చండకరశక్ర కార్ముక చంద్రసమాభాం నమామి కామాక్షీం॥

<u>తాత్పర్యము</u> :- ఉపాసకులు, హృదయమున, భృకుటి మధ్యమున శిరమునందలి సహస్రారమున అమ్మవారిని ధ్యానించుట సంప్రదాయము. హృదయము సూర్యమండలము గాను, ఫాలభాగము జ్యోతి స్స్వరూపముగాను, శిరస్సు చంద్రమండలముగాను వర్ణించి, అమ్మవారు ఆయా స్థానములలో సూర్య, అగ్ని, చంద్ర తేజములతో ప్రకాశించుటను సూచించుచు, అట్టి శ్రీమాతకు కవి నమస్కరించుచున్నాడు.

శ్లోకము 51

అధికాంచి కేళిలోలై రఖిలాగమ యంత్ర తంత్ర మంత్ర మయైః ।
అతిశీతం మమ మానస మసమశరద్రోహిజీవనోపాయైః॥

తాత్పర్యము:- కాంచీ నగరమున ఆటలాడుకొనుటయందభిలాషగల కామాక్షీఅమ్మవారు, మన్మథుని శత్రువైన శివుని జీవనోపాధియై ఆగమములన్నింటి సారమైన మంత్ర, తంత్ర, యంత్ర రూపమున ప్రకాశించుచు నా హృదయమును మిక్కిలి చల్లబరచుచున్నది.

శ్లోకము 52

నందతి మమ హృది కాచన మందిరయంతీ నిరంతరం కాంచీం ।
ఇందురవిమండలకుచా బిందువియన్నాదపరిణతా తరుణీ ॥

తాత్పర్యము:- నిరంతరము కాంచీ పట్టణమునే తన మందిరముగ చేసుకొని, నివసించు జనని కామాక్షీ దేవి లోకములను కాపాడుటకై చంద్ర సూర్యమండలములను పాలిండ్లుగాధరించి, బిందు, ఆకాశ, నాదరూపములుగా పరిణతిచెందుచు, నా హృయమున కొలువుండి ఆనందించుచున్నది.

శ్లోకము 53

శంపాలతాసవర్ణం సంపాదయితుం భవజ్వరచికిత్సాం ।
లింపామి మనసి కించన కంపాతటరోహి సిద్ధభైషజ్యం॥

తాత్పర్యము:- కంపా నదీ తీరమున, జనన మరణాత్మకమైన సంసార రోగమును పోగొట్టు మెరుపు తీగె వంటి సిద్ధౌషధము, కామాక్షీదేవియై, వృద్ధిపొందుచున్నది. ఆ లేపనము శ్రద్ధగా నా హృదయమున పూసుకొందును.

శ్లోకము 54

అనుమితకుచకాఠిన్యా మధివక్షః పీఠమంగజన్మరిపోః ।
ఆనందదాం భజే తామానంగ బ్రహ్మతత్వబోధిసిరాం॥

తాత్పర్యము:- అమ్మవారు, కుండలినీ రూపము దాల్చి, సుషుమ్న నాడిద్వారా, మూలాధారాది చక్రములను దాటి, సహస్రారమున శివునితో జేరి ఆనందమనుభవించుచు, శ్రీవిద్యోపాసకులైన భక్తులకు యోగానందము నొసగుచున్న ఆ జగజ్జననిని కామాక్షిని హృదయమున సేవించుచున్నాను.

శ్లోకము 55

ఐక్షిషి పాశాంకుశధర హస్తాంతం విస్మయార్హవృత్తాంతం ।
అధికాంచి నిగమవాచాం సిద్ధాంతం శూలపాణిశుద్ధాంతం॥

తాత్పర్యము:- శూలపాణియగు శివుని ఇల్లాలు, వేదవాక్యములచే ప్రతిపాదించబడినది, చేతులయందు పాశాంకుశములను ధరించినది, భండాసురాది దుష్టరాక్షస సంహారమొనర్చినది, అద్భుత చరిత్రగలదియైన ఆ కామాక్షీ అమ్మవారిని, కాంచీనగరమున దర్శించితిని.

శ్లోకము 56

ఆహితవిలాసభంగీ మాబ్రహ్మస్తంబశిల్పకల్పనయా ।
ఆశ్రితకాంచీమతులా మాద్యాం విస్ఫూర్తిమాద్రియే విద్యాం॥

తాత్పర్యము:- బ్రహ్మనుండి స్తంబ(తుంగమొక్క) పర్యంతము గల, చరాచరసృష్టి అంతయు, అమ్మవారిచే విలాసముగా చేయబడిన శిల్ప కల్పనమే. కాంచీ నగరమున ఆద్యవిద్యయైన, ఆ చైతన్య శక్తి కామాక్షీదేవి రూపముతో కొలువైయుండ, నేనామెను, అభిమానించి ఆశ్రయించుచున్నాను.

శ్లోకము 57

మూకోఽపి జటిలదుర్గతి శోకోఽపి స్మరతి యః క్షణం భవతీం ।
ఏకో భవతి సజంతు ర్లోకోత్తరకీర్తిరేవ కామాక్షీ॥

తాత్పర్యము:- లోకనిందననుభవించు మూగవాడైనను, కటిక దారిద్ర్య దుఃఖము కలవాడైనను, కామాక్షీ అమ్మవారిని, క్షణకాలము భక్తితో స్మరించినంత మాత్రము చేతనే, అతడు సాటిలేని మేటి కీర్తికి ఆలవాలమగుచున్నాడు.

శ్లోకము 58

**పంచదశవర్ణరూపం కంచన కాంచీవిహారధౌరేయం ।
పంచశరీయం శంభోర్వంచనవైదగ్ధ్యమూలమవలంబే॥**

తాత్పర్యము:- కాంచీపురంలో విహరించుటకు ఉత్సాహమును చూపు పంచదశీ మంత్రరూపిణియైన అమ్మవారి అనుగ్రహముచే, శివుని చేత దహింపబడిన మన్మథుడు కూడా, నిపుణతతో ఆదిదంపతుల అన్యోన్యాను రాగమును వృద్ధి పొందింప గలిగినాడు. ఆసామర్థ్యము, మాతల్లి చల్లని చూపువలననే సిద్ధించినది.

శ్లోకము 59

**పరిణతిమతీం చతుర్ధా పదవీం సుధియాం సమేత్య సౌషుమ్నీం ।
పంచాశదర్ణకల్పిత పదశిల్పాం త్వాం నమామి కామాక్షీమ్॥**

తాత్పర్యము:- సంస్కృతమునకు వర్ణములు ఏబది. యోగసాధకులు సుషుమ్నానాడిని ఆశ్రయించి, మూలాధారాది చక్రములలో, మాతృకలనబడు ఈ ఏబది వర్ణములతో అమ్మవారిని ఆరాధించుచున్నారు. భావప్రకటన సమయమున వాక్కు, పరా, పశ్యంతి మధ్యమ, వైఖరి రూపములతో పరిణమించుచున్నది. ఇట్లు పదశిల్పములనెన్నింటినో సృజించు మహామహిమాన్విత యగు కామాక్షీ దేవిని నమస్కరించుచున్నాను.

శ్లోకము 60

**ఆదిక్షన్మమ గురురాడాదిక్షాంతాక్షరాత్మికాం విద్యాం ।
స్వాదిష్ఠచాపదండాం నేదిష్ఠామేవ కామపీఠగతాం॥**

తాత్పర్యము:- తీయని చెరుకుగడను విల్లుగా ధరించి, సమీపమున గల కామకోటి పీఠమున కొలువై ఉన్న కామాక్షీదేవి, అకారము మొదలు క్షకారము దాకా ఉన్న వర్ణమాతృకాస్వరూపిణియై విరాజిల్లుచున్నది. ఆ మహావిద్యను గురు సార్వభౌముడు నాకు దయతో ఉపదేశించెను.

శ్లోకము 61

తుష్యామి హర్షితస్మర శాసనయా కాంచిపురకృతాసనయా ।
స్వాసనయా సకలజగద్భాసనయా కలితశంబరాసనయా॥

తాత్పర్యము:- మన్మథుని శాసించిన శివుని ఆనందపెట్టునది కాంచీనగరమును నివాసము చేసుకొన్నది. భక్తుల ఆత్మయే స్థానముగా కలది, సకల జగములను ప్రకాశింపజేయునది, దిశంబరాసురుని జయించి ఆతనిని తన ఆసనముగా చేసుకొన్నది, అయిన అమ్మవారి అనుగ్రహముచే సంతోషించుచున్నాను.

శ్లోకము 62

ప్రేమవతీ కంపాయాం స్థేమవతీ యతిమనస్సు భూమవతీ ।
సామవతీ నిత్యగిరామ్ సోమవతీ శిరసి భాతి హైమవతీ ॥

తాత్పర్యము:- కంపానది యందు ప్రేమకలది, యతుల మనస్సులందు స్థిరముగా నుండునది, సత్యవాక్యములగు వేదములందు సామవేదమై యొప్పునది, శిరస్సున చంద్రుని ధరించునది, సర్వాతిశయ మహిమకలది, హిమవంతుని పుత్రియైన అమ్మవారు, జగములంతటా చైతన్య శక్తియై ప్రకాశించుచున్నది.

శ్లోకము 63

కౌతుకినా కంపాయాం కౌసుమచాపేన కీలితేనాంతః ।
కులదైవతేన మహతా కుడ్మలముద్రాం ధునోతు నః ప్రతిభా॥

తాత్పర్యము:- కంపానదీ తీర విహారము నందు కుతూహలము కలది, పూవిల్లుధరించునది, హృదయమున ,కదలక స్థిరముగా నుండు కులదైవమైన కామాక్షీ అమ్మవారి చేత, మా కవితాశక్తి, మొగ్గ తొడిగియుండు దశ నుండి వికాసదశను పొందుగాక. జీవుడు ధ్యానము ద్వారా పరమాత్మను చేరు మార్గమిందు సూచింపబడినది.

శ్లోకము 64

యూనా కేనాపి మిలద్దేహా స్వాహా సహాయతిలకేన ।
సహకారమూలదేశే సంవిద్రూపా కుటుంబినీ రమతే॥

తాత్పర్యము:- అగ్ని నేత్రము తిలకముగా ధరించి శివుడు, కంచిలో సహకార వృక్షమూలమున కొలువై ఉన్నాడు. జ్ఞాన స్వరూపిణియైన కామాక్షీ అమ్మవారు, సదాశివ కుటుంబిని కావున ,అచట, ఆయనతో జేరి ఆనందింపజేయుచున్నది.

శ్లోకము 65

కుసుమశరగర్వసంపత్కోశ గృహం భాతి కాంచిదేశగతం ।
స్థాపితమస్మిన్ కథమపి గోపితమంతర్మయా మనోరత్నం॥

తాత్పర్యము:- కామసంజీవనౌషధియైన శ్రీమాత, మన్మథుని గర్వసంపదకు కోశాగారమై తనరుచున్నది. అది కాంచీ దేశమున నెలకొనియుండుటచే, నా మనోరత్నమునెట్లో అందుదాచియుంచి, రక్షించు కొనుచున్నాను. ఇంక ఏ మాయావియు దానిని అపహరింపలేదు.

శ్లోకము 66

దగ్ధషడధ్వారణ్యం దరదళితకుసుంభసంభృతారుణ్యం ।
కలయే తవ తారుణ్యం కంపాతటసీమ్ని కిమపి కారుణ్యం॥

తాత్పర్యము:- షడధ్వములు, పరతత్త్వమును జేరు మార్గములు. సాధకులై ఆ పరాశక్తిని చేరుకొన్నవారికి, ఇంక వాటితో పనిలేదు. అందువలన వాటిని దగ్ధమొనరింపుమని కవి అమ్మవారిని వేడుకొను చున్నాడు. కొద్దిగా వికసించిన కౌసుంభపుష్పము వలె ఎర్రనివర్ణముతో, కారుణ్యమేయనదగి, కంపానదీ తీరమున విహరించున్న ఓ కామాక్షీదేవీ! నీ యౌవన విలాసమును భక్తితో దర్శించు చున్నాను.

శ్లోకము 67

అధికాంచి వర్ధమానామతులాం కరవాణి పారణామక్ష్ణోః ।
ఆనందపాకభేదా మరుణిమపరిణామగర్వపల్లవితాం॥

తాత్పర్యము:- సాటిలేనిది, స్త్రీ రూపమున నున్న ఆనందస్వరూపము, పల్లవించిన ఎర్రదనముతో ప్రకాశించుచు, కాంచీనగరము నందు నివసించుచున్న కామాక్షీ అమ్మవారిని దర్శించి, నా కన్నులకు విందు చేసికొందును.

శ్లోకము 68

బాణసృణిపాశకార్ముకపాణి మముం కమపి కామపీఠగతం ।
ఏణధరకోణచూడం శోణిమపరిపాకభేదమాకలయే॥

తాత్పర్యము:- పాశాంకుశ పుష్పబాణ చాపములను చేతులలో ధరించి, చంద్రకళను శిరస్సున అలంకరించుకొని, అరుణ వర్ణముతో కామ పీఠమున విరాజిల్లుచున్న అమ్మవారిని బాగుగా ధ్యానించుచున్నాను.

శ్లోకము 69

కిం వా ఫలతి మమాన్యైర్బింబాధరచుంబిమందహాసముఖీ ।
సంబాధకరీ తమసామంబా జాగర్తి మనసి కామాక్షీ॥

తాత్పర్యము:- దొండపండు వంటి క్రింది పెదవిని, ముద్దిడుకొనుచున్న చిరునవ్వు కల ముఖముతో, అజ్ఞానపు చీకట్లను పూర్తిగా పారద్రోలుచు అన్నీ ఇచ్చు కామాక్షీ అమ్మవారు, నా హృదయమున మేలుకొని యుండగా ఇతర దేవతలేమి ఫలమీయగలరు?

శ్లోకము 70

మంచే సదాశివమయే పరశివమయలలితపౌష్పపర్యంకే ।
అధిచక్రమధ్యమాస్తే కామాక్షీ నామ కిమపి మమ భాగ్యం ॥

తాత్పర్యము:- శ్రీచక్రము అమ్మవారి నివాసగృహము. అందు శివాకారమైన మంచ యందు, పరమశివ పర్యంకమున, కామాక్షీదేవి అనెడు నా భాగ్యము కూర్చొని ఉన్నది.

శ్లోకము 71

రక్ష్యోఽస్మి కామపీఠీలాసికయా ఘనకృపాంబురాశికయా ।
శ్రుతియువతికుంతలీమణిమాలికయా తుహినశైలబాలికయా॥

తాత్పర్యము:- కామపీఠము ఊయలగా కలదియు, గొప్ప దయాజలమునకు వర్షాకాలమైనదియు, శ్రుతి సీమంతినుల కేశములందు మణిహారమైనదియు, హిమగిరి బాలికయు అయిన కామాక్షీ అమ్మవారిచే రక్షింపదగిన వాడనైయున్నాను.

శ్లోకము 72

లీయే పురహరజాయే మాయే తవ తరుణపల్లవచ్ఛాయే ।
చరణే చంద్రాభరణే కాంచీశరణే నతార్తిసంహరణే ॥

తాత్పర్యము:- త్రిపురసంహర్తయైన శివునిభార్యయగు అమ్మవారు త్రిపురసుందరి. మాయాస్వరూపిణి. కాంచీ నగరమున నివసించునది. ఆమె లేత చిగుళ్ళ వంటి ఎర్రని కాంతికలది. చంద్రుని శిరస్సున ఆభరణముగా ధరించినది నమస్కరించువారి బాధలను పోగొట్టునది. అట్టి కామాక్షీదేవి పాదమున ఐక్యమై దాగికొని యుందును.

శ్లోకము 73

మూర్తిమతి ముక్తిబీజే మూర్ధ్ని స్తబకితచకోరసామ్రాజ్యే ।
మోదితకంపాకూలే ముహుర్ముహుర్మనసి ముముదిషాఽస్మాకం ॥

తాత్పర్యము:- ప్రకృతి స్వరూపమును ఆకృతిగ ధరించినది, ముక్తికి మూలమైనది, శిరస్సున చంద్రుని పూగుత్తిగాతాల్చినది, కంపానదీ తీరమును తన ఉనికిచే సంతోషింపజేసిన అమ్మవారి వలన ఆనందమును పొందవలెనను కోరిక మా మనస్సున మాటిమాటికి కలుగుచున్నది.

శ్లోకము 74

వేదమయీం నాదమయీం బిందుమయీం పరపదోద్యదిందుమయీం ।
మంత్రమయీం తంత్రమయీం ప్రకృతిమయీం నౌమి విశ్వవికృతిమయీం॥

తాత్పర్యము:- విశ్వరూపమున గల ప్రకృతి అమ్మవారు. అందుగల వికృతులు పంచభూతములు. వేదము, నాదము, ఇందువనబడు సహస్రారము, అందున్నబిందువు, ఆగమోక్తమగు మంత్రతంత్రములు అన్నియు ఆ జగజ్జననియై ప్రకాశించుచున్నవి. సర్వం ఖల్విదం బ్రహ్మమనబడు ఆ తల్లికి నమస్కరించుచున్నాను.

శ్లోకము 75

పురమథనపుణ్యకోటీ పుంజితకవిలోకసూక్తిరసధాటీ ।
మనసి మమ కామకోటీ విహరతు కరుణావిపాకపరిపాటీ॥

తాత్పర్యము:- శివుని కోటి పుణ్యముల మూర్తియు, కవి సూక్తుల సారసర్వస్వము, కరుణా పరిణామ సంప్రదాయము, కామకోటి పీఠ దేవతయు అయిన అమ్మవారు నా హృదయమున విహరించు గాక.

శ్లోకము 76

కుటిలం చటులం పృథులం మృదులం కచనయనజఘనచరణేషు ।
అవలోకితమవలంబిత మధికంపాతటమమేయమస్మాభిః॥

తాత్పర్యము:- వక్రకేశములు, చంచల నేత్రములు, విపుల జఘనము, మృదుచరణములు కలిగి, కంపా నదీతీరమున చూడబడిన అప్రమేయమగు కామాక్షీ అమ్మవారు, మాచే ఆశ్రయింపబడినది.

శ్లోకము 77

ప్రత్యఙ్ముఖ్యా దృష్ట్యా ప్రసాదదీపాంకురేణ కామాక్ష్యాః ।
పశ్యామి నిస్తులమహో పచేళిమం కిమపి పరశివోల్లాసం॥

తాత్పర్యము:- కామాక్షీ అమ్మవారి అనుగ్రహవిశేషముచే, ఆత్మ దర్శనము చేయ గల లోచూపుతో సాటిలేని ఎన్నో పుణ్యముల ఫలమని చెప్పదగిన శివోల్లాసమైన అమ్మవారిని చూచుచున్నాను. తన ఆత్మయే, అమ్మవారని గ్రహించగలిగిన పుణ్యాత్ముడీ మూకకవి.

శ్లోకము 78

విద్యే విధాతృవిషయే కాత్యాయని కాళి కామకోటికలే ।
భారతి భైరవి భద్రే శాకిని శాంభవి శివేస్తువే భవతీం॥

తాత్పర్యము:- శ్రీ విద్యా స్వరూపమై బ్రహ్మకు తెలియబడుదానా! కాత్యాయనీ! కాళీ! చంద్రమౌళి యైన శివుని అంశమై ప్రకాశించు తల్లీ! భారతీ, భైరవీ! భద్రే! శాకినీ! శాంభవీ! శివే! నిన్ను స్తుతించుచున్నాను.

శ్లోకము 79

మాలిని మహేశచాలిని కాంచీఖేలిని విపక్షకాలిని తే ।
శూలిని విద్రుమశాలిని సురజనపాలిని కపాలిని నమోఽస్తు ॥

తాత్పర్యము:- పుష్పమాలాలంకృతయైనది,స్థాణువైన శివునిలో చైతన్యమై భాసించునది, కాంచీపట్టణమున ఆటలాడుచు విహరించునది, శత్రువులపాలిటి కాళియై వారిని సంహరించునది, శూలమును ధరించునది, పగడపు రంగుతో ప్రకాశించునది, దేవతలను కాపాడునది, కపాలమును ధరించునది అయిన అమ్మవారికి నమస్కారము.

శ్లోకము 80

దేశిక ఇతి కిం శంకే తత్తాదృక్తవను తరుణిమోన్మేషః ।
కామాక్షి శూలపాణేః కామాగమసమయతంత్ర దీక్షాయాం॥

తాత్పర్యము:- ఓ శివా! కామాక్షీ దేవీ! తత్త్వదర్శియైన నీ యౌవనోదయము, శివునకు కాదివిద్యా సమయ తంత్రదీక్ష యందు గరుత్వమును వహించుచున్నదో యన్నట్లు తోచుచున్నది.

శ్లోకము 81

వేదండకుంభడంబర వైతండికకుచభరార్తమధ్యాయ।
కుంకుమరుచే నమస్యాం శంకరనయనామృతాయ రచయామః ॥

తాత్పర్యము:- కుంభి కుంభములతో పోటీపడునట్టి ఉన్నత స్తనములు, మిక్కిలి సన్నని నడుము, కుంకుమ వర్ణము కలిగి శివుని కనులకు ఎర్రని అమృతమువలె తోచు అమ్మవారికి నమస్కరించుచున్నాను.

శ్లోకము 82

అధికాంచితమణికాంచన కాంచీమధికాంచి కాంచిదద్రాక్షం ।
అవనతజనానుకంపామనుకంపాకూలమస్మదనుకూలాం॥

తాత్పర్యము:-

గొప్ప విలువగల మణులతో పొదగబడిన వడ్డాణమును ధరించి, మా యందు అనుగ్రహము కలిగి, తనకు
భక్తితో నమస్కరించువారి యెడ దయగల తల్లిని కంపా నదీతీరమున, కాంచీ నగరమున దర్శించితిని.

శ్లోకము 83

పరిచితకంపాతీరం పర్వతరాజస్యసుకృతసన్నాహం ।
పరగురుకృపయా వీక్షే పరమశివోత్సంగమంగలాభరణం॥

తాత్పర్యము:- హిమవంతుని పుణ్యముల సమూహము, పరమశివుని ఒడికి బంగారువడ్డాణము, కంపా నదీతీర విహార పరిచయము గల అమ్మవారిని, పరమ గురుని దయతో చూచెదను.

శ్లోకము 84

దగ్ధమదనస్య శంభోః ప్రథీయసీం బ్రహ్మచర్యవైదగ్ధీం ।
తవ దేవి తరుణిమశ్రీ చతురిమపాకో న చక్షమే మాతః ॥

తాత్పర్యము:-

శివుడు, మన్మథుని దగ్ధమొనర్చి బ్రహ్మచర్య దీక్షను పూనినప్పటికిని, అమ్మవారి యౌవన శోభా విశేషమామెను, ఆ స్వామి దగ్గరకు చేర్చినది. తుది విజయమా తల్లిదేయని కవి సంభావన

శ్లోకము 85

మదజలతమాలపత్రా వసనితపత్రా కరాదృతఖనిత్రా ।
విహరతి పులిందయోషా గుంజాభూషా ఫణీంద్రకృతవేషా॥

తాత్పర్యము:- శివుడు, కిరాత వేషంలో వచ్చి అర్జునుని పరీక్షించి మెచ్చి, పాశుపతాస్త్రమును ప్రసాదించాడు. అప్పుడు, పతివ్రతయైన అమ్మవారు, కిరాత స్త్రీ వేషాన్ని ధరించి, ఆయనను అనుసరించింది. ఆమె తమాల పత్రములు వస్త్రంగా, గురువింద పూసలు హారాలుగా, సర్పరాజును శిరోజములను బంధించు తాడుగా ధరించి వచ్చింది. ఆ జననియే వనదుర్గ.

శ్లోకము 86

అంకే శుకినీ గీతే కౌతుకినీ పరిసరే చ గాయకినీ ।
జయసి సవిధేఽంబ భైరవమండలినీ శ్రవసి శంఖకుణ్డలినీ॥

తాత్పర్యము:- మహా భైరవుడు శివుడు. ఆయన భార్య మహాభైరవి. ఆమె ఒడిలో చిలుకను పెట్టుకొని, చుట్టుప్రక్కల గల గాయనీ గాయకులు పాడిన పాట యందనురక్తి కలిగియున్నది. చెవులకు శంఖములే కుండలములుగా ధరించినది. ఆమె సమీపమున వేదములు కుక్కలై తిరుగుతున్నవి. అట్టి ఓ జగజ్జననీ నీవు సర్వోత్తమముగ వర్ధిల్లుచు, నా సమ్ముఖమున నున్నావు.

శ్లోకము 87

ప్రణతజనతాపవర్గా కృతరణసర్గా ససింహసంసర్గా ।
కామాక్షి ముదితభర్గా హతరిపువర్గా త్వమేవ సా దుర్గా॥

తాత్పర్యము:- భక్తితో నమస్కరించు జనులకు మోక్షము నిచ్చునది, రాక్షస సంహారమునకు యుద్ధము చేయునది, సింహమును వాహనముగా చేసుకొన్నది, శివుని సంతోషపెట్టునది, శత్రునాశన మొనరించునది ఐన కామాక్షీ అమ్మవారు, ఆ దుర్గా స్వరూపమే.

శ్లోకము 88

శ్రవణచలద్వేదండా సమరోద్దండా ధుతాసురశిఖండా ।
దేవి కలితాంత్రషండా ధృతనరముండా త్వమేవ చాముండా॥

తాత్పర్యము:- కర్ణములకు ఊగులాడుచున్న ఏనుగులు కలది, శత్రువులతో ఏర్పడు యుద్ధములందు ఔద్ధత్యము చూపునది, భయముతో వణుకుచున్న రాక్షసులను కిరీటములుగా కలది, ప్రేగులు, కపాలములు మెడలో హారములుగా ధరించినది ఐన అమ్మవారు చండీ దేవతగా కీర్తింపబడుచున్నది.

శ్లోకము 89

ఉర్వీధరేంద్రకన్యే దర్వీభరితేన భక్తపూరేణ ।
గుర్వీమకించనార్తిం ఖర్వీకురుషే త్వమేవ కామాక్షి ॥

తాత్పర్యము:- హిమవంతుని కుమార్తెవైన ఓ కామాక్షీ దేవీ!నీవే, అన్నపూర్ణవై గరిటెలో నింపబడిన అన్నపు ముద్దతో, మిక్కిలి ఆకలిగొన్న పేదల బాధను తీర్చుచున్నావు.

శ్లోకము 90

తాడితరిపుపరిపీడన భయహరణ నిపుణహలముసలా ।
క్రోడపతిభీషణముఖీ క్రీడసి జగతి త్వమేవ కామాక్షి॥

తాత్పర్యము:- ఓ కామాక్షీ దేవీ!నీవే, వరాహ ముఖముతాల్చి వారాహివై, చేతులలో హల, ముసలములను ఆయుధములుగా ధరించి శత్రువులను జయించి, భక్తుల భయమును పోగొట్టుటలో సమర్థురాలవగుచున్నావు.

శ్లోకము 91

స్మరమథనవరణలోలా మన్మథహేలావిలాసమణిశాలా ।
కనకరుచిచౌర్యశీలా త్వమంబ బాలా కరాబ్జధృతమాలా॥

తాత్పర్యము:- మన్మథుని మథించిన శివుని, నీ సౌందర్యహేలా విలాసములతో వరించుటయందాసక్తి గల ఓ కామాక్షీ దేవీ! నీవు, బంగారు వర్ణముతో ప్రకాశించుచు, చేతిలో జపమాలను ధరించి బాలాస్వరూపముతో దర్శనమిచ్చుచున్నావు.

శ్లోకము 92

విమలపటీ కమలకుటీ పుస్తక రుద్రాక్ష శస్తహస్తపుటీ ।
కామాక్షి పక్ష్మలాక్షీ కలితవిపంచీ విభాసి వైరించీ॥

తాత్పర్యము:- ఓ కామాక్షీ దేవీ!, తెల్లని వస్త్రమును ధరించి, కమలమున కూర్చుండి, చేతులలో పుస్తకమును, జపమాలను పట్టుకొని, ఒడిలో వీణను పెట్టుకొని కనబడుచున్న సరస్వతివి నీవే.

శ్లోకము 93

కుంకుమరుచిపింగమసృక్పంకిలముండాలిమండితం మాతః ।
జయతి తవ రూపధేయం జపపటపుస్తకవరాభయకరాబ్జం॥

తాత్పర్యము:- అమ్మా! కుంకుమ ధరించుటచే ఏర్పడిన పింగల వర్ణము కలిగి, రక్తసిక్తమైన పుర్రెలచే అలంకరింపబడి, కమలముల వంటి చేతులయందు జపమాల, పుస్తకము, వరద , అభయ ముద్రలు తాల్చిన నీ రూపవిశేషము మిక్కిలి జయించుచున్నది.

శ్లోకము 94

కనకమణికలితభూషాం కాలాయసకలహశీలకాంతికలాం ।
కామాక్షి శీలయే త్వాం కపాలశూలాభిరామకరకమలాం॥

తాత్పర్యము:- ఇనుమును మించిన నలుపురంగు కలిగి, మణిమయములగు బంగారు ఆభరణములు దాల్చి, పుర్రెను, శూలమును చేతులయందు ధరించిన రూపము గల కామాక్షీ దేవి, నిన్ను ధ్యానించుచున్నాను.

శ్లోకము 95

లోహితమపుంజమధ్యే మోహితభువనం ముదా నిరీక్షంతే ।
వదనం తవ కుచయుగళం కాంచీసీమాం చ కేఽపి కామాక్షి॥

తాత్పర్యము:- నీ అరుణారుణ కాంతి సమూహమును చూచి, లోకము మోహితమగుచున్నదే కానీ, అందలి ముఖాద్యవయవ భేదమును శివాభిన్న సిద్ధులవలె అగ్ని, సూర్య చంద్రాదులుగా, దర్శింపలేకున్నది. ఇందు, శ్రీచక్రమునందలి కామకలా రహస్యమువర్ణింపబడినది.

శ్లోకము 96

జలధిద్విగుణితహుతవహ దిశాదినేశ్వరకలాశ్వినేయదళైః।
నలినైర్మహేశి గచ్ఛసి సర్వోత్తరకర కమలదలమమలం॥

తాత్పర్యము:- యోగమున కుండలినీ శక్తియైన అమ్మవారు, మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూరక, అనాహత, విశుద్ధ, ఆజ్ఞా,చక్రములను దాటి సహస్రారమున గల శివునితో ఐక్యమగు ఈ చక్రములనే కమలము (పద్మము)లుగా వర్ణింతురు. అందు, క్రమముగా నాలుగు, ఆరు, పది, పంద్రెండు, పదహారు, రెండు దళములుండును. సహస్రారమున వేయి దళములు గల పద్మముండును. సాధకునకు అక్కడ, ఆ శివశక్త్యైక్య రూపము దర్శనమిచ్చును.

శ్లోకము 97

సత్కృతదేశికచరణాః సబీజనిర్బీజయోగనిశ్రేణ్యా ।
అపవర్గసౌధవలభీమారోహంత్యంబ కేఽపి తవ కృపయా॥

తాత్పర్యము:- గురూపదేశమును పాటించి, అమ్మా! నీ కృపకు పాత్రులైన సాధకులు ఏ కొందరో, అవిద్యాస్వరూపమైన సబీజ సమాధిని దాటి, జ్ఞానప్రధానమైన నిర్బీజ సమాధిని పొంది, క్రమముగా మోక్ష సౌధమును అధిరోహించి ,నీ సన్నిధిని చేరి, ఆనందించుచున్నారు.

శ్లోకము 98

అంతరపి బహిరపి త్వం జంతుతతేరంతకాంతకృదహంతే ।
చింతితసంతానవతాం సంతతమపి తంతనీషి మహిమానం॥

తాత్పర్యము:- అహంతా స్వరూపమున అన్ని జీవులయందును, బహిరంతరముల ఉన్న నీవు, యముని సైతము, నియంత్రింపగలవు. అమ్మా! భక్తితో నిరంతరము నిన్ను ధ్యానించువారి మహిమను వృద్ధిచేయుదువు.

శ్లోకము 99

కలమంజులవాగనుమిత గళపంజరగతశుకగ్రహౌత్కంఠ్యాత్ ।
అంబ రదనాంబరంతే బింబఫలం శంబరారిణా న్యస్తం॥

తాత్పర్యము:- ఓ కామాక్షీదేవీ! అవ్యక్త మధుర మంజుల వాక్కుచే తెలియబడు, నీ కంఠమను పంజరముననున్న చిలుకను పట్టుకొనుటకు మన్మథుడు, పెదవి అను దొండపండును ఎరగా పెట్టినాడు.

శ్లోకము 100

జయ జయ జగదంబ శివే జయ జయ కామాక్షి జయ జయాద్రిసుతే ।
జయ జయ మహేశదయితే జయ జయ చిద్గగనకౌముదీధారే॥

<u>తాత్పర్యము</u> :- మంగళ స్వరూపవగు ఓ జగజ్జననీ! నీకు జయము. ఓ కామాక్షీదేవీ! నీకు జయము. పర్వతరాజ పుత్రివగు ఓ పార్వతీ! నీకు జయము. మహేశ్వరుని భార్యవగు ఓ తల్లీ! నీకు జయము. చిదాకాశమందలి దట్టమైన వెన్నెల ప్రవాహమగు శ్రీమాతా! నీకు జయము.